పారిశుద్ధ్యం.. అస్తవ్యస్తం

- జిల్లాలో అధ్వానంగా మున్సిపాలిటీలు
- రోడ్డు పక్కనే పేరుకుపోయిన వ్యర్థాలు
- పట్టించుకోని అధికార యంత్రాంగం



పరిగి మార్కెట్‌యార్డులో రోడ్డు పక్కన పేరుకుపోయిన మురుగు

వికారాబాద్: పారిశుద్ధ్య నిర్వహణ జిల్లాలోని పట్టణాల్లో అటకెక్కింది. ఓ పక్క వరుసబెట్టి వర్షాలు కురుస్తుండగా.. మరోపక్క డ్రైనేజీలు పొంగి పొర్లుతున్నాయి. దీంతో వికారాబాద్, తాండూరు, పరిగి, కొడంగల్ పట్టణాల్లో పారిశుద్ధ్యం అధ్వానంగా మారింది. కాలనీల్లో ఇళ్ల మధ్య, రోడ్లపైన మురుగు కుప్పలుతెప్పలుగా పేరుకుపోతున్నా పట్టించుకున్న నాథుడే కరువయ్యారు. వర్షపునీరు, డ్రైనేజీతో కలిసి రోడ్లపై ఏరులై పారుతుండడంతో ప్రజలు తీవ్ర అవస్థలు పడుతున్నారు. మున్సిపల్ అధికారులు మాత్రం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారు.

రోజురోజుకూ సమస్య తీవ్రం

పట్టణాల్లో పారిశుద్ధ్య సమస్య రోజురోజుకు అధికమవుతుంది. ప్రస్తుతం వర్షాలు కురుస్తుండటంతో మరింత తీవ్రరూపం దాలుస్తోంది. మున్సిపల్ సిబ్బంది చెత్త సేకరణను అస్తవ్యస్తం చేశారు. ఇష్టారీతిన పట్టణ శివారు ప్రాంతాల్లో చెత్తను డంపింగ్ చేస్తున్నారు. దీంతో దోమలు, ఈగలు వ్యాప్తి చెంది ప్రమాదకర జ్వరాలు ప్రబలుతున్నాయి. ఆస్పత్రుల చుట్టూ తిరుగుతూ ప్రజలు ఇక్కట్లు పడుతున్నారు. మరోపక్క ఉదయం లేవగానే తడి పొడి చెత్త వేరువేరుగా వేయాలని మున్సిపాలిటీ వాహనాలతో ఊదరగొట్టే యంత్రాంగం చేతులెత్తేసింది. పన్నుల వసూలులో చొరవచూపే అధికారులు పారిశుద్ధ్య నిర్వహణపై దృష్టి సారించడం లేదు.

కాలనీల్లో దుర్గంధం

పురపాలక సంఘాల పరిధిలోని చాలా కాలనీలు దుర్గంధంతో నిండిపోయాయి. నివాసాల మధ్య మురుగు పేరుకుపోయి పందులు, దోమలకు ఆవాసాలుగా మారుతున్నాయి. జిల్లాలోని నాలుగు మున్సిపాలిటీలు ఉండగా అందులో ఎక్కడా చెత్త సేకరణ విధానం సక్రమంగా లేదు. అధికారులు చెబుతున్న దానికి వాస్తవ పరిస్థితులకు పొంతన లేదు. తడి పొడి చెత్త వేరు చేయడానికి మున్సిపాలిటీల్లో చెత్త బుట్టలు అందజేస్తున్నప్పటికీ దానిపై అవగాహన కల్పించటంలో అధికారులు విఫలమవుతున్నారు. ఇప్పటికైనా యంత్రాంగం చొరవచూపి పారిశుద్ధ్య నిర్వహణపై దృష్టి సారించాలని స్థానికులు కోరుతున్నారు.

అధికారుల తీరుపై మండిపాటు

తాండూరులో
ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి బస్తీబాట



24వ వార్డులో నాలాను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి

తాండూరు: అధికారుల తీరుపై తాండూరు ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డి అసహనం వ్యక్తం చేశారు. శుక్రవారం మున్సిపల్ పరిధిలోని 23, 24 వార్డులో బస్తీబాట నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానికులు మురుగునీటి వ్యవస్థ అధ్వానంగా ఉందని ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చారు. దీంతో ఆయన పరిశీలించి కమిషనర్ విక్రమ్‌సింహారెడ్డిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. నిధులు ఉన్నా పనులు ఎందుకు చేపట్టడంలేదని నిలదీశారు. అనంతరం గొలుసుకట్టు చెరువులైన మల్‌రెడ్డిపల్లి చెరువును సందర్శించారు. అలుగు పారితే వరద నీరు గొల్ల చెరువుకు వెళ్లే మార్గాన్ని పరిశీలించారు. పలుచోట్ల నాలా కబ్జాకు గురవడంతో పాటు శిథిలావస్థకు చేరింది. అక్కడకు ఇరిగేషన్ ఏఈ రాకపోవడంతో ఎమ్మెల్యే మండిపడ్డారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. గొల్ల చెరువు కలుషితం కావడంతో తాండూరు వాసులు రోగాలబారిన పడుతున్నారన్నారు. చెరువుల్లోకి మురుగు నీరు చేరకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారన్నారు. మున్సిపాలిటీలో కొత్త మంచినీటి పైప్‌లైన్‌ల వ్యవస్థను పునరుద్ధరించేందుకు రూ.15 కోట్ల నిధులను ప్రభుత్వం నుంచి మంజూరు చేయిస్తాన్నన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ బాల్‌రెడ్డి, హిందూ ఉత్సవ సమితి ప్రధాన కార్యదర్శి నర్సింహులు, మున్సిపల్ కౌన్సిలర్లు శ్రీలత, ప్రభాకర్‌గౌడ్, రామకృష్ణ, యూత్ కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు వేణుగోపాల్, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు ధారాసింగ్, నాయకులు ఉత్తమ్‌చంద్, పురుషోత్తం రావు శ్రీనివాస్‌గౌడ్, ఆయా శాఖల అధికారులు తదతరులు పాల్గొన్నారు.

ఎవరి బెంచీ వారే తెచ్చుకోండి!

పరిగి: బలపం పట్టి అక్షరాలు దిద్దే చేతులతో బల్లలు మోయించారు ఉపాధ్యాయులు. ఇదేంటని అడిగిన వారిపై దురుసుగా మాట్లాడిన సంఘటన పరిగి పట్టణ కేంద్రంలో శుక్రవారం చోటు చేసుకుంది. ఈ దృశ్యాలు సామాజిక మాధ్యమాల్లో వైరల్ కావడంతో స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేశారు. మాదగ్గర అటెండర్ లేడని అందుకే విద్యార్థులతో పనులు చేయిస్తున్నామని ఉపాధ్యాయులు తెలిపారు. ఈ విషయంపై ఎంఈఓ హరిశ్చందర్‌ను వివరణ కోరగా.. తన దృష్టికి రాలేదని సమాధానం ఇచ్చారు.





ప్రాథమిక పాఠశాలలో బెంచీలను తరలిస్తున్న చిన్నారులు

గణనాథుల సందడి షురూ



వికారాబాద్‌లో ప్రతిమల కొనుగోలులో ప్రజలు



వికారాబాద్‌లో పూజాసామగ్రి కొంటున్న భక్తులు



గాంధీకాలనీలో విద్యుద్దీపాలతో వెలిగిపోతున్న వినాయక మండపం దారి

అనంతగిరి: వినాయక చవితి సందర్భంగా ఊరూరా గణనాథులు కొలువుదిరేందుకు సర్వం సిద్ధమయింది. చిన్న పెద్ద అనే తేడా లేకుండా గణపయ్యను స్మరించుకుంటూ విగ్రహాలను దుకాణాల నుంచి మండపాలకు శుక్రవారం తరలించారు. ఈసారి పలు భిన్న ఆకృతుల్లో వినాయక విగ్రహాలు భక్తులను ఆకట్టుకున్నాయి. మేళతాళాల నడుమ కొలాహలంగా విగ్రహాల తరలింపు ప్రక్రియ సాగింది. ఆయా ప్రాంతాల్లో మండపాలు విద్యుద్దీపాలతో జిగేల్ మంటున్నాయి.

ఉత్సవాలకు పూర్తి సహకారం

తాండూరు టౌన్: వినాయక ఉత్సవాలకు పట్టణ మున్సిపల్ శాఖ తరఫున పూర్తి సహకారం ఉంటుందని మున్సిపల్ చైర్‌పర్సన్ స్వప్నాపరిమళ్ పేర్కొన్నారు. శుక్రవారం పట్టణంలోని పలు వార్డుల్లోని రోడ్లను పరిశీలించారు. గుంతలు ఉన్న చోట వెంటనే పూడ్చేయాలని మున్సిపల్ ఏఈ ఖాజా హుస్సేన్‌ను ఆదేశించారు. ఈ సందర్భంగా చైర్‌పర్సన్ మాట్లాడుతూ.. వినాయక ప్రతిష్ఠ తొలి రోజు నుంచి నిమజ్జనం వరకు మున్సిపల్ కార్మికులు ప్రతి వార్డులోని మంటపాల వద్ద పారిశుద్ధ్య పనులు నిర్వహించనున్నట్లు తెలిపారు. చివరి రోజు నిమజ్జనానికి తరలివెళ్లే వినాయకులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా వార్డుల్లోని రోడ్లకు తాత్కాలిక మరమ్మతు చేయిస్తున్నట్లు చెప్పారు.

విద్యార్థుల సమస్యల పరిష్కారానికి కృషి

ఆర్‌ఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షుడు భీమరాజు

కొడంగల్ రూరల్: విద్యార్థి లోకానికి స్ఫూర్తిని కలిగించే శక్తిగా రెవల్యూషనరీ స్టూడెంట్ యూనియన్(ఆర్‌ఎస్‌యూ) కృషి చేస్తుందని సంఘం రాష్ట్ర అధ్యక్షుడు భీమరాజు అన్నారు. శుక్రవారం పట్టణంలోని కాంగ్రెస్ పార్టీ నాయకుడు కృష్ణంరాజు నివాసంలో ఆర్‌ఎస్‌యూ జాతీయ మొదటి మహాసభలకు సంబంధించిన లోగోను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా భీమరాజు మాట్లాడుతూ.. విద్యార్థి సమస్యలను పోరాటాల ద్వారా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తూ పరిష్కరించుకునేందుకు ఆర్‌ఎస్‌యూ సంఘం కృషిచేస్తుందన్నారు. ఏపీలోని తిరుపతిలో ఈ నెల 13, 14, 15 తేదీలలో నిర్వహించనున్న జాతీయ మహాసభలను జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు ఫయాజ్, నరేష్, భీమేష్, ఆంజనేయులు పాల్గొన్నారు.



జాతీయ మహాసభల లోగోను ఆవిష్కరిస్తున్న నాయకులు

గర్భిణులకు పోషకాహారం తప్పనిసరి



కుల్కచర్ల: అంగన్‌వాడీ కేంద్రంలో ఐసీడీఎస్ సిబ్బంది, మహిళలు



బంట్వారం: పోషకాహార ప్రదర్శనను తిలకిస్తున్న సీడీపీఓ ప్రవీణ

బంట్వారం: గర్భిణులు, బాలింతలు పోషకాహారం తీసుకుంటేనే ఆరోగ్యంగా ఉంటారని ఐసీడీఎస్ సీడీపీఓ ప్రవీణ అన్నారు. శుక్రవారం కోట్‌పల్లి మండల కేంద్రంలో పోషకాహార మాసోత్సవాలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె హాజరై మాట్లాడారు. తల్లి ఆరోగ్యంగా ఉంటేనే బిడ్డ ఆరోగ్యంగా ఉంటుందన్నారు. ప్రతి రోజు భోజనంలో ఆకు కూరలు, కూరగాయలు, గుడ్లు తప్పనిసరిగా ఉండాలన్నారు. అంతకు ముందు పోషకాహారంపై ప్రదర్శన నిర్వహించి అవగాహన కల్పించారు. అలాగే పిల్లల బరువు, ఆకలి నిర్ధారణను పరిశీలించారు. కార్యక్రమంలో డాక్టర్ శివశంకర్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ధనలక్ష్మి, వైద్య సిబ్బంది, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆశ వర్కర్లు, బాలింతలు, గర్భిణులు పాల్గొన్నారు.

రక్తహీనత నివారించాలి

కొడంగల్ రూరల్: మహిళల్లో రక్తహీనత నివారణకు పోషక విలువలు కలిగిన ఆహారమే మేలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ దాసమ్మ అన్నారు. మండల పరిధిలోని అప్పాయిపల్లిలో అంగన్‌వాడీ కేంద్రాల ఆధ్వర్యంలో పోషకాహార ఉత్సవాలను నిర్వహించారు. ముందుగా గ్రామంలో పోషకాహార గురించి ర్యాలీ నిర్వహిస్తూ గ్రామస్తులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో డాక్టర్ అమృత, ప్రాథమికోన్నత పాఠశాల హెచ్‌ఎం విష్ణుకుమార్, అంగన్‌వాడీ టీచర్ చంద్రకళ, విద్యార్థులు పాల్గొన్నారు.

పోషకాహారంతో సంపూర్ణ ఆరోగ్యం

కుల్కచర్ల: పోషకాహారం తీసుకోవడంతో సంపూర్ణ ఆరోగ్యం సిద్ధిస్తుందని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ అంజమ్మ, గండిచెరువుతండా ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు లలితమ్మ తెలిపారు. శుక్రవారం మండల పరిధిలోని గండిచెరువు తండాలోని అంగన్‌వాడీ కేంద్రంలో పోషకాహార మాసోత్సవాలను నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గర్భిణులు, బాలింతలు పోషకాహారం తీసుకోవడంతో ఎటువంటి అనారోగ్య పరిస్థితులు తలెత్తకుండా సుఖ ప్రసవాలు జరుగుతాయన్నారు. అంగన్‌వాడీ టీచర్ మనెమ్మ, ఆశ కార్యకర్త పద్మ, స్థానిక మహిళలు పాల్గొన్నారు.

మట్టి వినాయకులనే పూజిద్దాం



పరిగి: మట్టి గణనాథులను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి దంపతులు



తాండూరు టౌన్: విగ్రహాలను అందజేస్తున్న చైర్‌పర్సన్ స్వప్నాపరిమళ్



కొడంగల్ రూరల్: మట్టి వినాయకులను పంపిణీ చేస్తున్న లయన్స్‌క్లబ్ ప్రతినిధులు

ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి

పరిగి: మట్టి వినాయకులని ప్రతిష్ఠించడంతో పర్యావరణ సమతుల్యత దెబ్బతినదని పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి అన్నారు. శుక్రవారం పట్టణ కేంద్రంలో జిల్లా రైస్ మిల్ అసోసియేషన్ అధ్యక్షుడు శ్రీనివాస్‌గుప్తా ఆధ్వర్యంలో ఎమ్మెల్యే దంపతులు మట్టి వినాయకులను పంపిణీ చేశారు. అనంతరం ఎమ్మెల్యేమాట్లాడుతూ.. ప్లాస్టర్ ఆఫ్ పారిస్‌తో తయారు చేసిన వినాయకులను ప్రతిష్ఠించడంతో చెరువులు, కుంటల్లో నీరు కలుషితం అవ్వుతుందన్నారు. పండగను ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని సూచించారు. కార్యక్రమంలో పార్టీ పట్టణ అధ్యక్షుడు కృష్ణ, నాయకులు శ్రీను, బాబయ్య తదితరులు పాల్గొన్నారు.

తాండూరు గాంధీచౌక్‌లో

తాండూరు టౌన్: మట్టి వినాయక విగ్రహాలను ప్రతిష్ఠించి పర్యావరణ పరిరక్షణకు సహకరించాలని తాండూరు మున్సిపల్ చైర్‌పర్సన్ స్వప్నాపరిమళ్ కోరారు. శుక్రవారం స్థానిక గాంధీచౌక్‌లో వాసవి మహిళా సంఘం ఆధ్వర్యంలో ఆమె మట్టి వినాయకులను పంపిణీ చేశారు.

కొడంగల్‌లో..

కొడంగల్ రూరల్: మట్టి వినాయకులను పూజిస్తూ పర్యావరణ పరిరక్షణకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని లయన్స్ క్లబ్ అధ్యక్షుడు మురారి వశిష్ట, మున్సిపల్ వైస్ చైర్మన్ ఉషారాణి అన్నారు. లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో పట్టణంలోని మహాదేవుని ఆలయ ఆవరణలో మట్టి విగ్రహాలను పంపిణీ చేశారు.

పర్యావరణానికి మేలు

తాండూరు రూరల్: మట్టి వినాయకులను ప్రతిష్ఠించడంతో పర్యావరణానికి మేలు కలుగుతుందని మండల పరిధిలోని చెంగోల్ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కిష్టప్ప అన్నారు. శుక్రవారం పాఠశాలలో విద్యార్థులతో మట్టి వినాయకులను తయారు చేయించారు.

ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో..

అనంతగిరి: ప్రతి ఒక్కరూ మట్టి వినాయక విగ్రహాలను మాత్రమే పూజించాలని మాజీ మున్సిపల్ చైర్మన్ సత్యనారాయణ, ఆర్యవైశ్య సంఘం వికారాబాద్ అధ్యక్షుడు మాలె లక్ష్మణ్ గుప్తా కోరారు. ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో ప్రజలకు మట్టి వినాయకులను పంపిణీ చేశారు.

చైర్‌పర్సన్ ఆధ్వర్యంలో

అనంతగిరి: ప్రతి ఒక్కరూ మట్టి వినాయకులను ప్రతిష్ఠించి పూజిద్దామని మున్సిపల్ చైర్‌పర్సన్ చిగుళ్లపల్లి మంజులరమేష్‌కుమార్ కోరారు. ఈమేరకు శుక్రవారం వార్డులో ప్రజలకు మట్టి వినాయకులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో మాజీ మున్సిపల్ వైస్‌చైర్మన్ రమేశ్‌కుమార్ పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

• గురువులకు సన్మానం



బొంరాస్‌పేట: మండల కేంద్రంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలోని ఫిజికల్ సైన్స్ టీచర్ భవాని ఉత్తమ ఉపాధ్యాయురాలిగా లయన్స్‌క్లబ్ ఎంపిక చేశారు. అలాగే ఇటీవల పాఠశాలకు చెందిన ఫిజికల్ డైరెక్టర్ గోపాల్, హిందీ ఉపాధ్యాయుడు ఎజాద్ హైమద్ ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపిక కావడంతో ప్రత్యేకంగా పాఠశాల ఉపాధ్యాయ బృందం శుక్రవారం సన్మానించారు. ఇందులో ఉపాధ్యాయులు ప్రశాంత్‌కుమార్, మల్లయ్య, చంద్రశేఖర్, కాశయ్య, వెంకటయ్య, హరికాంత్ తదితరులున్నారు.

• బాలకృష్ణారెడ్డి మృతి బాధాకరం

దోమ: ఉద్యమకారుడు జిట్ట బాలకృష్ణారెడ్డి మృతి బాధాకరమని సర్పంచుల సంఘం దోమ మాజీ అధ్యక్షుడు రాజిరెడ్డి అన్నారు. శుక్రవారం ఆయన పార్థివదేహానికి నివాళులర్పించారు. పార్టీలకు అతీతంగా జిట్టా తన సొంత ఆస్తులమ్మి తెలంగాణ ఉద్యమానికి ధారపోశాడన్నారు.

• పరిశుభ్రంగా ఉంచుకుందాం

దుద్యాల్: మండల పరిధిలోని హకీంపేట గ్రామంలో శుక్రవారం వైద్య సిబ్బంది గ్రామంలో పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఏఎన్‌ఎం విజయలక్ష్మి మాట్లాడుతూ.. ప్రధాన వీధుల గుండా ప్రజలకు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ప్రతిజ్ఞ చేయించారు. ప్రతి ఒక్కరూ వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని సూచించారు. కార్యక్రమంలో ఆశ కార్యకర్తలు ప్రమీల, వసంత పాల్గొన్నారు.

• అర్హులందరికీ రుణమాఫీ

కుల్కచర్ల: ప్రభుత్వం పేర్కొన్న నియమనిబంధనలను అనుసరించి రుణమాఫీ ప్రక్రియ కొనసాగుతుందని మండల వ్యవసాయ శాఖ అధికారి వీరస్వామి తెలిపారు. శుక్రవారం మండలంలోని చెల్లాపూర్, ఘణపూర్ గ్రామాలలో రుణమాఫీ సర్వే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రస్తుతం రేషన్‌కార్డు లేని వారికి రుణమాఫీ వర్తించని పక్షంలో వారి వివరాలను ప్రత్యేకంగా పరిశీలిస్తున్నామన్నారు.

• జాగ్రత్తలు ముఖ్యం

కుల్కచర్ల: వినాయక విగ్రహాలు ఏర్పాటు చేస్తున్న మండపాల వద్ద నిర్వాహకులు తగు జాగ్రత్తలు తీసుకోవాలని కుల్కచర్ల ఎస్‌ఐ అన్వేష్ రెడ్డి అన్నారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ.. వినాయక చవితి ఉత్సవాలు ప్రారంభమౌతున్న నేపథ్యంలో నిర్వాహకులు తగు జాగ్రత్తలు పాటించాలన్నారు. విద్యుత్ కనెక్షన్లు తీసుకునే క్రమంలో అధికారులకు సమాచారం అందించాలని అన్నారు.

• మండపాల వద్ద సీసీ కెమెరాలు

పరిగి: పట్టణ కేంద్రంతో పాటు వివిధ గ్రామాల్లోని వినాయక ఉత్సవ కమిటీ సభ్యులు నియమ నిబంధనలు పాటించాలని పరిగి సీఐ శ్రీనివాస్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. వినాయక మండపాల వద్ద తప్పకుండా సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో ప్రతిఒక్కరూ జాగ్రత్తలు పాటించాలని సూచించారు.

• సబ్‌స్టేషన్‌కు స్థల పరిశీలన

మర్పల్లి: మండల పరిధిలోని పట్లూర్ గ్రామంలో కొత్తగా సబ్‌స్టేషన్ ఏర్పాటు చేసేందుకు స్థలాన్ని పరిశీలించినట్లు మర్పల్లి ట్రాన్స్‌కో ఏఈ రాంచంద్రయ్య తెలిపారు. శుక్రవారం గ్రామంలోని సోలార్ కంపెనీ పక్కన ఉన్న సర్వే నంబర్ 84 ప్రభుత్వ భూమిలో ఎకర స్థలంలో సబ్‌స్టేషన్ నిర్మించేందుకు సర్వే చేయించామన్నారు. నివేదికను ఉన్నతాధికారులకు పంపుతామన్నారు.

• శాంతియుతంగా జరుపుకోవాలి

మర్పల్లి: గణేశ్ నవరాత్రి ఉత్సవాలను శాంతియుతంగా జరుపుకోవాలని మర్పల్లి ఎస్‌ఐ సురేశ్ సూచించారు. శుక్రవారం మండల కేంద్రంలోని ఓ పంక్షన్ హాల్‌లో ఆయా గ్రామస్తులతో శాంతి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ మాట్లాడుతూ.. గణేశ్ మండపాలు ఏర్పాటు చేసే ముందు తప్పనిసరిగా పోలీసుల నుంచి అనుమతులు తీసుకోవాలన్నారు. అత్యవసర సమస్యలు ఉంటే వెంటనే 100కు సమాచారం ఇవ్వాలన్నారు.

• ఉపాధ్యాయ వృత్తి ఉన్నతమైనది

బంట్వారం: ఉపాధ్యాయ వృత్తి సమాజంలో ఎంతో గౌరవ ప్రదమైనదని ఎంపీడీఓ రాములు అన్నారు. శుక్రవారం మండల పరిషత్ కార్యాలయంలో ఉత్తమ ఉపాధ్యాయులకు సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఎంపీడీఓ మాట్లాడారు. విద్యార్థులను భావి భారత పౌరులుగా తీర్చిదిద్దేది ఉపాధ్యాయులేనన్నారు. సమ సమాజ నిర్మాణంలో ఉపాధ్యాయుల పాత్ర కీలకమైందన్నారు. అన్ని వృత్తుల్లో కంటే ఉపాధ్యాయ వృత్తి ఉన్నతమైందన్నారు. అనంతరం ఉత్తమ ఉపాధ్యాయులను శాలువా పూలమాలలతో సత్కరించి మెమొంటోలు అందజేశారు. కార్యక్రమంలో ఎంఈఓ చంద్రప్ప, ఎంపీఓ నాగరాజు, మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ సరళారెడ్డి, హెచ్‌ఎంలు వెంకటేశ్వర్‌రావు,విక్రమ్‌రెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

విద్యార్థులకు సరళ బోధన అవసరం

కుల్కచర్ల: విద్యార్థులకు అర్థమయ్యేలా పాఠాలు బోధించాలని చౌడాపూర్ మండల నోడల్ అధికారి రాంచందర్ అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని లింగన్నపల్లి, కొత్తపల్లి, బాపిసింగ్ తండాలలో ప్రాథమిక పాఠశాలలను సందర్శించి విద్యార్థుల సామర్థ్యాలను పరీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఉపాధ్యాయులు బోధించే క్రమంలో అవసరమైన వనరులను ఉపయోగించుకోవాలన్నారు. సమయపాలన పాటిస్తూ పాఠశాలకు చేరుకోవాలని సూచించారు. ఉపాధ్యాయులు విద్యా వ్యవస్థ ఉన్నతికి కృషి చేయాలని తెలిపారు. కార్యక్రమంలో సీఆర్పీ విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

పీఆర్‌టీయూ మండల కార్యవర్గం ఎన్నిక



నూతన కార్యవర్గ సభ్యులను సన్మానిస్తున్న బీసీ సంఘం ప్రతినిధులు

యాలాల: ప్రోగ్రెసివ్ రికగ్నైజ్డ్ టీచర్స్ యూనియన్(పీఆర్‌టీయూ) యాలాల మండల నూతన కార్యవర్గాన్ని గురువారం ఎన్నుకున్నారు. తాండూరు పట్టణంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో ఏర్పాటు చేసిన సర్వసభ్య సమావేశంలో మండల అధ్యక్షుడిగా కృష్ణారెడ్డి, ప్రధాన కార్యదర్శిగా సీహెచ్.రాములు, అసోసియేట్ అధ్యక్షుడిగా వెంకటయ్య, కార్యదర్శిగా రమాకాంత్, ఉపాధ్యక్షుడిగా శ్రీనివాస్, మహిళ విభాగం మండల అధ్యక్షురాలిగా శశిదేవి, కార్యదర్శిగా మాలతీ తదితరులను కార్యవర్గంలోకి తీసుకున్నారు.

చిరు సన్మానం

ఎన్నికైన నూతన కార్యవర్గాన్ని బీసీ సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం ఘనంగా సన్మానించారు. సంఘ అధ్యక్షుడు కృష్ణారెడ్డి, ప్రధాన కార్యదర్శి రాములును పూలమాల, శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో బీసీ సంఘం మండల అధ్యక్షుడు లక్ష్మణాచారి, మాజీ సర్పంచ్ ప్రవీణ్, కృష్ణవేణి స్కూల్ ప్రిన్సిపాల్ ప్రశాంత్, ఉపాధ్యాయులు వెంకట్‌రెడ్డి, పరమేశ్, మొగులప్ప, రాజశేఖర్ ఉన్నారు.

ఘనంగా వరాహస్వామి జయంతి



ప్రత్యేక అలంకరణలో స్వామివారు

కొడంగల్ రూరల్: పట్టణంలో పేదల తిరుపతిగా పేరుగాంచిన శ్రీమహాలక్ష్మీ వేంకటేశ్వర స్వామివారి ఆలయంలో శుక్రవారం వరాహ స్వామి జయంతి సందర్భంగా ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. తిరుమల తిరుపతి దేవస్థానంలో మాదిరిగానే స్థానికంగా పూజలు నిర్వహిస్తామని ఆలయ ధర్మకర్తలు తెలిపారు. శ్రీవరాహస్వామివారికి పంచామృతం, సుగంధ ద్రవ్యాలతో అభిషేకం నిర్వహించారు. పూజలో పాల్గొన్న భక్తులు తమ గోత్రనామాలతో స్వామివారికి అర్చన కార్యక్రమాలు చేశారు.

ఐటీఐలో మిగులు సీట్లకు దరఖాస్తులు

అనంతగిరి: జిల్లాలో ప్రభుత్వ, ప్రైవేట్ ఐటీఐ కళాశాలలో మిగులు సీట్ల భర్తీకి ప్రవేశం కల్పిస్తున్నట్లు వికారాబాద్ ఐటీఐ ప్రిన్సిపాల్ నరేంద్రబాబు ఒక ప్రకటనలో తెలిపారు. కొత్తగా దరఖాస్తు చేసుకునేవారు ఈనెల 20లోపు చేసుకోవాలని సూచించారు. ఇది వరకు దరఖాస్తు చేసుకున్న వారు వెబ్ ఆప్షన్లు తీసుకోవాలన్నారు. అర్హులైన విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. మరిన్ని వివరాలకు 91774 72488లో సంప్రదించాలన్నారు.

దాడులకు పాల్పడిన వారిని కఠినంగా శిక్షించాలి

కొడంగల్ రూరల్: కుమురం భీం ఆసిఫాబాద్ జిల్లా జైనూర్‌లో ఇటీవల ఓ వర్గంపై దాడులకు పాల్పడిన వారిని కఠినంగా శిక్షించాలని ఎంఐఎం పార్టీ కొడంగల్ నియోజకవర్గ అధ్యక్షుడు ఎస్‌బీ.గుల్షన్ డిమాండ్ చేశారు. శుక్రవారం పట్టణంలోని పార్టీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ.. లౌకికపార్టీ అని చెబుతున్న కాంగ్రెస్‌కు ఇలాంటి సంఘటనలు కనిపించడం లేదా అని ప్రశ్నించారు. దాడులకు పాల్పడిన వారిపై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో నాయకులు ముస్తాఫా, ఆబిద్, ముర్తుజా, రోమాన్, అజర్, సర్దుజ్‌హుస్సేన్, జాఫర్‌ఖాన్ పాల్గొన్నారు.